సీఎం సహాయనిధికి ఐలా రూ.50వేలు విరాళం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ముఖ్యమంత్రి సహాయ నిధికి కంచరపాలెంలోని ఐలా సంస్థ చైర్మన్ జగపతి రాజు రూ.50వేల చెక్కును జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌కు శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అందజేశారు. రాష్ట్రంలో ఇటీవల వచ్చిన వరదల నేపథ్యంలో బాధితుల సహాయర్థం రూ.25 వేల చెక్కును, మరో రూ.25 వేల విలువ గల రొట్టెలు, బిస్కెట్లని జిల్లా యంత్రాంగానికి ఇదివరకు అందజేశామన్నారు. దీంతో ఒక లక్ష రూపాయలు తమ సంస్థ నుంచి అందించామని ఐలా చైర్మన్ కలెక్టర్‌కు వెల్లడించారు. వరదల సమయంలో వాసివ ఇండస్ట్రీయల్ అసోసియేషన్, పివా, ఐలా సంస్థల తరపున రూ.15.50 లక్షల విలువ గల ఆహారాన్ని బాధితులకు అందజేసినట్లు కలెక్టరుకు చైర్మన్ తెలిపారు.

'ఇది మంచి ప్రభుత్వం'

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ఈ 100 రోజుల్లో చేసిన మంచిని, చేపట్టిన ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడమే ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక 27వ వార్డులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం విశాఖ దక్షిణ శాసనసభ నియోజకవర్గ శాసనసభ్యులు సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నెహ్రూ బజారు వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. గత 100 రోజుల్లో ప్రభుత్వం చేసిన మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రజావేదికను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీంతో పాటు ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి కుటుంబానికి 100 రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా పింఛన్ల పెంపు, మెగా డిఎస్సీ ద్వారా జిల్లాలో 16వేలకు పైగా ఉద్యోగాల భర్తీ, ఇతర సంక్షేమ కార్యక్రమాలను ఈ కార్యక్రమం ద్వారా వివరించడం జరుగుతుందని అన్నారు. అలాగే ఇటీవల విజయవాడలో వచ్చిన వరదల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి 10 రోజుల పాటు అక్కడే ఉండి తీసుకున్న చర్యలు గురించి ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని ఆయన వివరించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యేతో కలిసి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కరును, కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో వీఎమ్మార్డీఏ సెక్రటరీ డి.కీర్తి, టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్చార్జి సీతంరాజు సుధాకర్, స్థానిక కార్పొరేటర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: మండలంలోని ముదపాక గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని, వంద రోజుల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని ఖజానా మొత్తం ఖాళీ చేసి ప్రజలు కోలుకోలేకుండా చేసిందని విమర్శించారు.

కూటమి ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ పథకాలతో పాటు యువతకు మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగ అవకాశాలు 3 వేల పెన్షన్ మొత్తాన్ని 4 వేలకు పెంపు, రాష్ట్రవ్యాప్తంగా అన్నా క్యాంటీన్లు ఏర్పాటు వంటి ప్రజాసంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ జిల్లా టిడిపి అధ్యక్షుడు గండి బాబ్జి, గుర్రంపాలెం మాజీ సర్పంచ్ సుఖ సాయి, ముదపాక జనసేన నాయకులు పత్రి శివ, గోరపల్లి సత్యారావు, మధుపాక అప్పారావు, నీలాపు రమణ, అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆనందపురం: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ వంద రోజుల్లోనే అనుకున్న విధంగా కంటే మరిన్ని పథకాలు అమలు చేసామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్ర మానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తమది ప్రజా ప్రభుత్వమని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. విజయవాడ వరదల్లో ముఖ్యమంత్రి పని తీరుకు 97 శాతం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు.

నిరుద్యోగ యువత భవిష్యత్ కు భరోసా ఇచ్చేలా 16,347 పోస్టులలో మెగా డీఎస్సీ, పేదల ఆకలి తీర్చడానికి రూ.5 కే భోజనం అందించే అన్నా క్యాంటీన్లు, రూ.1,000 పెన్షన్ పెంపు, ప్రజలను భయభ్రాంతులను చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేశామని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి 3 సిలిండర్లు పథకాలు తొందర్లోనే అమలు చేస్తామని ప్రకటించారు. ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాల్లోని 64 పంచాయతీలను జీవీఎంసీలో విలీనం చేయనున్నామని, భీమిలి పట్టణంలోని మూడు ప్రధాన రోడ్లను విస్తరించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, ఎంపీడీవో అడపా లవరాజు, తాసిల్దార్ పేర్లి శ్యామ్ ప్రసాద్, కూటమి నాయకులు కోరాడ రాజబాబు, భీమిలి జనసేన ఇంచార్జ్ పంచకర్ల సందీప్, కె.రామానాయుడు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ , శ్రీను బాబు, బిఆర్‌బి నాయుడు, తమ్మిన అప్పలరాజు, మహంతి శివాజీ, మీసాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భీమిలి: మండలంలో గల అన్ని పంచాయతీల్లో అధికారులు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. 2671 గృహాలను సందర్శించి 100 రోజుల ప్రభుత్వ పాలనలో చేరుకొన్న లక్ష్యాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించారు. కార్యక్రమానికి సంబంధించిన స్టిక్కర్లు, కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ సీతారామ మూర్తి, మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి డా. వి.జానకి, పంచాయతీ విస్తరణ అధికారి గుండు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి అయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని 75వ వార్డు కండిపిల్లి వీధిలో వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి వెంకట రమణా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గాజువాక నియోజక వర్గ నోడల్ అధికారి పద్మలత, గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రి ముఖ్య అతిధులుగా పాల్గొని ఈ వంద రోజులలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాస రావు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, కూటమి నాయకులు నమ్మి అప్పారావు, కోన చిన అప్పారావు, కిలాన ముసలయ్య, ములకలపల్లి పెంటయ్య, కండి పిల్లి రమణ, కోన చంటి, పులి అప్పల, రెడ్డి కాకినాడ అప్పల రాజు నమ్మి పుష్ప రమణ, ముద్దుర్తి సాంబ శివరావు, బొంగు రాజు, బత్తిన పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

విశాఖ సిటీ: టిడిపి, జనసేన, బిజెపి పార్టీల కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పరిపాలన పూర్తయిన సందర్భంగా ఆంధ్ర యూనివర్సిటీ తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆంధ్ర యూనివర్సిటీ పరిపాలన విభాగం మెయిన్ గేట్ వద్ద మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కోసి మిఠాయిల పంచి బాణాసంచా వెలిగించడం జరిగింది. ఈ సందర్భంగా వందరోజుల పరిపాలనలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగులు మొదటి తేదీన జీతాలు అందుకోవడం, ప్రజాస్వామ్యం పాలనతో ఉద్యోగులకు స్వాతంత్రం వచ్చినట్లు అయిందని, గత పాలకుల పాలనలో ఇబ్బందులు పడిన వారందరికీ ఇప్పుడిప్పుడే మంచి రోజులు రావడం ఆనందకర సమయంగా భావిస్తున్నట్టు పలువురు వక్తలు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ఆవల రమేష్, పీతల అమరేంద్ర, బండారి దేముడు, ఒమ్మి నూకరాజు, పీతల వెంకట్రావు, చిరంజీవి గణేష్, సాయి బలరాం, పైడిరాజు, యాసిన్ బాబా, గణేష,, పైడి శ్రీనివాస్ తదితరులతో పాటుగా ఉద్యోగులు పాల్గొన్నారు.

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 61వ వార్డులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం సచివాలయం సిబ్బంది వార్డు అధ్యక్షులు మజ్జి సోమేష్, వార్డు మహిళా అధ్యక్షురాలు సరస్వతి శ్రీలక్ష్మి పాల్గొని ఇప్పటివరకు ప్రభుత్వం చెప్పింది చెప్పినట్టుగా అమలు చేసినటువంటి పథకాలను వివరించారు. ఇకపై చేయవలసిన పథకాలు కూడా త్వరలోనే అమలు కావడం జరుగుతుందని గడపగడపకు వెళ్లి ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం ఉంటుందని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ ప్రజలకు చేరువ అయ్యే రోజులు దగ్గర్లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్లు వెంటనే తెరవాలి

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో వివిధ సమస్యలపై స్థానిక నాయకులు శుక్రవారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. ఆనందపురం మండలంలో కేటాయించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలానికి వెంటనే సరిహద్దులు నిర్మించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సీహెచ్‌సీగా మార్చాలని, వేములవలసలో రైతు బజార్, పేదవాడికి పట్టెడన్నం పెట్టే అన్న క్యాంటీన్‌లు వెంటనే తెరవాలని, గ్రామాల నుండి నేషనల్ హైవేకు వెళ్లే విధంగా వెసులుబాటు కల్పించాలని వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తర్లువాడ సర్పంచ్ బిఆర్బి నాయుడు, మహంతి శివాజీ, లోడగల వెంకట్రావు, అంగటి రాము తదితరులు పాల్గొన్నారు.

తాటితూరులో పొలంబడి

విశాలాంధ్ర - తగరపువలస: భీమిలి మండలం తాటితూరు గ్రామంలో వేముల వారి కల్లాల వద్ద పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమిలి వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ్ ప్రసాద్ మాట్లాడుతూ ఒక ఎకరా ప్రయోగపు పొలంలో రైతులకు పురుగు మందుల వాడకం తగ్గించడంలో భాగంగా లింగాకర్షణ బుట్టలు, వేప నూనె, పసుపు జిగురు అట్టలు సరఫరా చేసి వాటి ఉపయోగాలు వివరించారు. ఈ కార్యక్రమంలో భీమిలి మండల వ్యవసాయ అధికారిణి శివ కోమలి, వ్యవసాయ రైతు సేవ కేంద్ర సిబ్బంది స్వాతి, కృపామని, స్రవంతి, రమేష్, హరీష్, రైతులు జాంబ, మోహన్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

విశాలాంధ్ర-గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ గోపాలపట్నం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 1983 - 84 చదువుకున్న టెన్త్ బ్యాచ్ 40 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకచోట కలుసుకున్నారు. ఈ పాఠశాలలో ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత విద్యను అందించిన పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పేరును తీసుకురావడమే కాకుండా ఆ పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన వారిలో ఎందరో ఉన్నారు. ముఖ్యంగా ఆ బ్యాచ్‌కు చెందిన పి.జి.వి. ఆర్.నాయుడు (గణబాబు) స్థానిక శాసనసభ్యులు. ఎలాంటి సౌకర్యాలు లేని సమయంలో పాఠశాలకు నూతన భవనాలు నిర్మించడమే కాకుండా పాఠశాలకు విద్యార్థుల ఆటల పాటలకు గ్రౌండ్, ఇండోర్ స్టేడియం, పాఠశాల చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించారు. ముఖ్యంగా రాష్ట్ర యువశక్తి అవార్డు గ్రహీత నందవరపు సోములు ఈ బ్యాచ్‌కి చెందిన వారే. వీటిని నిర్వహించడంలో ఈ బ్యాచ్‌లో సింహాచలం మాజీ సర్పంచ్ పాసర్ల ప్రసాద్, బండారు త్రినాథ్, గోకోడ మధుబాబులు ప్రధాన పాత్ర పోషిస్తుంటారు. ఈ సందర్భంగా నందవరపు సోములు మాట్లాడుతూ టెన్త్ బ్యాచ్ 40 సంవత్సరాల పూర్తి అయినవేళ అందరం అదే పాఠశాలలో "గెట్ టు గెదర్" పెట్టుకుని సెలబ్రేట్ చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.

రోడ్డుపై మురుగు నీరు: పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - ఆనందపురం: వేములవలస పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. పాత సినిమా హాలుకు వెళ్లే డ్రైనేజీ కాలువలో నీరు రోడ్డుపైనే పొంగి ప్రవహిస్తుంది. రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్రమైన దుర్వాసనతో ఇబ్బందులకు గురవుతున్నారు. కాలువలో నాణ్యత లేకపోవడం వల్ల డ్రైనేజీ వాటర్ రోడ్డుపైకి వచ్చేస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

మధురవాడ పీఏసీఎస్‌ను క్రెడిట్ సొసైటీగా మార్చండి

గంటాకి సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు వినతి

విశాలాంధ్ర - విశాఖ: మధురవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని పీఏసీఎస్ క్రెడిట్ సొసైటీగా మార్చాలని భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావుకు సొసైటీ పూర్వ ఉపాధ్యక్షులు, సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు విజ్ఞప్తి చేశారు. మధురవాడ పీఏసీని 1958లో స్థాపించారని తెలిపారు. 1959 నుండి సంఘ కార్యకలాపాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఈ సంఘంలో 3,084 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఋణాల మంజూరు, వ్యవసాయ సంబంధిత వ్యాపార కార్యకలాపాలకు ఋణాలు మంజూరు చేయడం సంఘం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ సంఘానికి సుమారుగా 50 సెంట్ల విస్తీర్ణంలో 10 షాపులు ఉన్నాయని, ఈ షాపులను అద్దెకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సంఘానికి 2005 నవంబర్‌లో ఎన్నికలు జరిగాయని, 13 మంది మేనేజింగ్ కమిటీ సభ్యులు కాగా వారిలో ఒక ప్రెసిడెంటు, ఒక వైస్ ప్రెసిడెంటు, మిగతా వారు 5 సంవత్సరాల కాల పరిమితితో పాలక వర్గ సభ్యులుగా సంఘంలో కొనసాగుతున్నారని తెలిపారు. ప్రస్తుతం మధురవాడ పరిధిలో ఉన్న వ్యవసాయ భూములు అన్నీ రియల్ ఎస్టేట్ భూములుగా మారిపోయాయని, సంఘం వ్యవసాయ ఋణాలు కూడా సన్నగిల్లిపోయాయని తెలిపారు. అందువల్ల గతంలో జరిగిన సభలో ఈ సంఘాన్ని పీఏసీఎస్ పరిధి నుండి మధురవాడ క్రెడిట్ సొసైటీగా మార్చేందుకు సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసారని తెలిపారు. జిల్లా సహకార శాఖ అధికారులు సంఘానికి 2013లో పర్సన్ ఇన్‌ఛార్జ్‌ని నియమించారని అన్నారు. అప్పటి నుండి నేటి వరకు అఫీషియల్ పిఐసి కమిటీగా నాన్ ఆఫీషియల్ పిఐసి కమిటీగా వారిచే ఈ సంఘం కార్యకలాపాలు జరుగుతున్నాయని చెప్పారు. 2021 డిసెంబర్ 29న నిర్వహించిన మహాజన సభలో ఈ మధురవాడ పీఏసీఎస్ ప్రతిపాదనలు సహకార సంఘం డిప్యూటీ రిజిస్ట్రార్‌కి, ఆంధ్రప్రదేశ్ సహకార సంఘం కమీషనర్, రిజిస్ట్రార్‌కి సమగ్ర ప్రతిపాదనలు సమర్పించామని తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రతిపాదనలు సహకార సంఘం కమీషనర్ పరిశీలనలో ఉన్నాయని అన్నారు. ఈ మధ్య కాలములో జిల్లా సహకార శాఖ అధికారులు సంఘానికి ఉన్న షాపులను కూలగొట్టి పెట్రోల్ బంకును నిర్వహించేందుకు ప్రణాళికలు వేయగా సంఘం సభ్యులు వ్యతిరేకించి అనేక పోరాటాలను చేసారని, హైకోర్టును ఆశ్రయించి దీన్ని అడ్డుకున్నామని తెలిపారు. సంఘానికు ఎన్నికలు నిర్వహించి, ఎన్నికైన మేనేజింగు కమిటీ ద్వారా సంఘం కార్యకలాపాలు నిర్వహించుకునెలా చేయాలని కోరారు. ఈ సంఘాన్ని మధురవాడ పరపతి సంఘంగా మార్పు చేయడానికి తగిన చర్యలు తీసుకొనవలసినదిగా కోరారు. వినతిపత్రంపై సొసైటీ సభ్యులు, 7వ వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ, వాండ్రాసి అప్పలరాజు, పిల్లా వెంకటరావు, పోతిన ఎల్లం నాయుడు, పోతిన ప్రసాద్, సియ్యాద్రి పైడితల్లి తదితరులు సంతకాలు చేశారు.

జిల్లాలో ముగిసిన రాష్ట్ర గవర్నర్ పర్యటన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ విశాఖ జిల్లాలో రెండు రోజుల పర్యటన శుక్రవారంతో ముగిసింది. ఏయూలో ఏర్పాటు చేసిన దివ్య కళా మేళా ప్రారంభోత్సవం కోసం గురువారం రాష్ట్ర గవర్నర్ జిల్లాకు విచ్చేసిన సంగతి విదితమే. పర్యటన ముగియడంతో విశాఖ విమానాశ్రయంలో శుక్రవారం సాయంత్రం ఆయనకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత భాగ్చి, జీవిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్, రెవిన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్, పోలీస్, ఎయిర్ పోర్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడ్డ ముగ్గురు వ్యక్తులు అరెస్ట్

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి, గోపాలపట్నం ప్రాంతాలలో రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పెందుర్తి సీఐ కే.శ్రీనివాసరావు తెలిపారు. పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన దొంగల వివరాలు వెల్లడించారు. విజయనగరం జిల్లా, బొబ్బిలి ప్రాంతానికి చెందిన మర్రి రవికుమార్, మర్రి డేవిడ్, బాడంగి ప్రాంతానికి చెందిన పూతి సురేష్‌లు పాపయ్యరాజు పాలెంలో ద్వారపూడి నాగేశ్వరరావు ఇంటిలో దొంగతనానికి పాల్పడి మూడున్నర తులాలు బంగారం, 45 తులాల వెండి చోరీకి పాల్పడ్డారని వెల్లడించారు. నాగేశ్వరరావు కుటుంబీకులు యాత్రకు వెళ్లగా గమనించిన నిందితులు చోరీకి పాల్పడ్డారని వెల్లడించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిఘా పెట్టి సుజాత నగర్‌లో నిందితులను అరెస్ట్ చేసి, వారి నుండి బంగారం, వెండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరు గతంలో అనేక దొంగతనాలకు పాల్పడి జైల్లో ఉండి వచ్చారని, గుంటూరులో చిన్న, చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారని సీఐ చెప్పారు.

విశాఖ పోర్ట్‌లో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు పర్యటన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామ్‌చందర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిషన్ డైరెక్టర్ డా. జి.సునీల్ కుమార్ బాబు, కమిషన్ సభ్యుని ప్రైవేట్ సెక్రటరీ వి.క్రాంతి కుమా ర్‌లతో కలిసి శుక్రవారం విశాఖపట్నం పోర్ట్ అథారిటీలో పర్యటించారు. డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్ కుమార్ దూబే కమిషన్ సభ్యునికి సాదర స్వాగతం పలికారు. కమిషన్ సభ్యులు రామ్‌చందర్, పోర్ట్ అధికారులతో పాటు ఎస్‌సి ఉద్యోగులు, అధికారుల సంఘం ప్రతినిధులతో కలిసి పరి పాలనా కార్యాలయ ప్రాంగణంలో ఒక మొక్కను నాటారు. సభ్యుడు పోర్ట్ యొక్క ఎస్‌సి ఉద్యోగులు అధికారుల సంఘంతో సమావేశం నిర్వహించారు. ఇందులో ఎస్‌సి ఉద్యోగుల సమస్యలు ఆయా సంఘాల ప్రతినిధులు కమిషన్ సభ్యుని దృష్టికి తీసుకు వచ్చారు. అనంతరం పోర్ట్ మేనేజ్మెంట్‌తో రిజర్వేషన్ విధానాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పోర్ట్‌లో ఎస్సీ సంక్షేమం కోసం సిఎస్ఆర్ నిధుల వినియోగంపై ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామ్‌చందర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎస్‌సి సంఘం ప్రతినిధులు, పోర్ట్ విభాగాధిపతులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు. పోర్ట్ కార్యదర్శి టి.వేణు గోపాల్ ఈ సమాచారాన్ని మీడియాకు తెలియజేశారు.

పరిశ్రమల స్థాపనకు సంపూర్ణ సహకారం అవసరం

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సంపూర్ణ సహకారం అందించాలని, తాత్కాలికంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. డి.ఐ.ఈ.పి.సి. (డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్పోర్టు ప్రమోషన్ కమిటీ) సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ విండో విధానంలో సులభతర రీతిలో అనుమతులు జారీచేయాలని, సమస్యలేమైనా ఉంటే అక్కడిక్కడే పరిష్కరించాలని పేర్కొన్నారు. పరిశ్రమల ఏర్పాటు, నిర్వహణకు సంబంధించిన పలు వివిధ అంశాలపై స్పందిస్తూ కలెక్టర్ పలు మార్గదర్శకాలు జారీ చేశారు.ఆటో నగర్ పారిశ్రామిక వాడలో నీటి సరఫరాలో అంతరాయం లేకుండా పైప్ లైన్లకు మరామ్మతులు త్వరితగతిన చేపట్టాలని జీవిఎంసి అధికారులను ఆదేశించారు. ముందుగా పరిశ్రమల శాఖ జీఎం సీహెచ్.గణపతి అజెండా అంశాలను కలెక్టర్‌కు వివరించారు. గత సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాల గురించి తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం సీహెచ్. గణపతి, ఏడీ రమామణి, ఎల్డిఎం ఎం.శ్రీనివాస్, డిఆర్డిఎ పీడీ ఎం.ఎస్. శోభారాణి, ఆర్ అండ్ బి ఎస్ఈ కె.కాంతిమతి, ఇతర సంబంధిత అధికారులు, పలువురు ఔత్సాహికులు తదితరులు పాల్గొన్నారు.

జూట్ మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - తగరపువలస: కార్మికుల మిగులు సమస్యల పరిష్కారానికై కార్యాచరణ రూపొందించినట్టు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. చిట్టివలస జూట్ మిల్ కార్మికుల మిగుల సమస్యల పరిష్కారానికై కార్యాచరణ రూపొందించేందుకు జిఆర్ భవన్‌లో కొండపు ఈశ్వరరావు అధ్యక్షతన కార్మిక నాయకులు సమావేశమయ్యారు. కార్మికులకు రావాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలని అన్నారు. కార్య, ఈ సమావేశంలో టిఎన్టియుసి సెక్రటరీ సాడిఅచ్చరావు, ఐఎన్టియుసి నాయకులు జీరు వెంకటరెడ్డి, కార్మిక సంఘ నాయకులు దల్లి అవులరెడ్డి, యిమంది కూర్మారావు, ఏఐటీయూసీ స్థానిక నాయకులు అల్లు బాబురావు, బిల్ల రాంపైడి, కానూరి రాంబాబు, పిట్ట సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

DOCUMENT MISSING

I BUSAM DHANAKANAKA LINGESWARARAO s/o Busam Siva Gangadhara Rao, Hindu, aged 44 Years, Resident of D.No.28-45/6, Flat No: S-2, Sivalayam Road, Kurmanna palaem, Near Post Office, Duvvada, Visakhapatnam. I have lost my **Link Document No: 3392/2010** while i was travelling on 26-8-2024 from Kurmanna palem to Desapatrunipalem. Anyone found my Link document Please contact 9866984979.

జీవీఎంసీ స్థాయి సంఘంలో
అభివృద్ధి పనులకు ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయి సంఘం ఆమోదం తెలిపిందని స్థాయి సంఘం చైర్ పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని స్థాయి సంఘం సమావేశ మందిరంలో స్థాయి సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థాయి సంఘం చైర్ పర్సన్ మాట్లాడుతూ స్థాయి సంఘం సమావేశంలో 124 అంశాలతో కూడిన అజెండాను పొందుపరచగా, వాటిని స్థాయి సంఘం సభ్యులు చర్చించిన పిదప 2 అంశాలు రద్దు పరచడమైనదని, 35 అంశాలు వాయిదా వేసినట్టు, మిగిలిన 84 అంశాలు సభ్యులు ఆమోదించినట్టు ఆమె తెలిపారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన సుమారు రూ.13.18 కోట్లు, ప్రజారోగ్య విభాగానికి సుమారు రూ.2.26 కోట్ల అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారని చైర్ పర్సన్ తెలిపారు. ఈ సమావేశంలో జీవీఎంసీ కార్యదర్శి ఎం.వి.డి ఫణి రామ్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఇ.వాసు దేవ రెడ్డి, కార్యనిర్వాహక

ఇంజినీర్లు దిలీప్, రత్నాకర్ రెడ్డి, సహాయక వైద్యాధికారులు డాక్టర్లు కిషోర్, కిరణ్ కుమార్, కృష్ణంరాజు, సునీల్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు వంశీ, వెంకటేశ్వరరావు, మాధవరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ్ కాలేజీకి బెస్ట్ క్రమశిక్షణ అవార్డు

విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కాలేజీకి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, విశాఖపట్నం, బెస్ట్ డిస్టిన్ అవార్డ్ ప్రకటించిందని ప్రిన్సిపాల్ ఎస్ ఈ ఫ్లోరా తెలిపారు. 78 వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన డిస్ట్రిక్ట్ మార్చ్ ఫాస్ట్ పెరేడ్‌లో ఆదర్శ్ విద్యార్థి మానస కుమారి నాయకత్వంలో విద్యార్థులు ప్రదర్శించిన విధేయతకు ఉత్తమ క్రమశిక్షణ అవార్డు లభించిందని ఆమె వెల్లడించారు. ఇటీవల జరిగిన ఫస్ట్ ఎయిడ్ డే సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డిస్ట్రిక్ట్ సెక్రటరీ పి. రవికుమార్, రిసోర్స్ పర్సన్ ట్రైనర్ ఎండి రహంతుల్లా చేతుల మీదుగా కళాశాల సెక్రటరీ టి.థియోఫిలస్, ఆదర్శ్ ఐఆర్ సిఎస్ కోఆర్డినేటర్ జి. మంజుల ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదర్శ్ కోఆర్డినేటర్ జి.మంజుల మాట్లాడుతూ క్రమశిక్షణ బహుమతి ఆదర్శ్ డిగ్రీ కాలేజ్ కి రావడం ఆనందం కలిగించిందని తమ విద్యార్థులకు విద్యతో పాటు ఉన్నత విలువలతో కూడిన సామాజిక బాధ్యతను క్రమశిక్షణను యాజమాన్యం నేర్పిస్తుందని తెలియజేశారు.

వినాయకుని కళ్యాణ వేడుకల్లో శరగడం దంపతులు

విశాలాంధ్ర - పెందుర్తి: జీవిఎంసీ 96వ వార్డు, పాత పెందుర్తి సమీపంలోని ఎల్ఐసీ కాలనీలో వినాయక ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆర్కే ఈవెంట్స్ అధ్వర్యంలో యువకులు 21 అడుగుల బారీ విగ్రహాన్ని నెలకొల్పి ప్రతీరోజు పూజాదికాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం సిద్దిబుద్ది సమేత శ్రీ వినాయకుడి కళ్యాణం వైభవంగా

నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు, మాజీ కార్పోరేటర్ శరగడం చినఅప్పలనాయుడు, అనురాధ దంపతులు పాల్గొని వినాయకుడి కళ్యాణం జరిపించి భక్తులకు ప్రసాద వితరణ చేసారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల పరిశీలన

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను స్థానిక కార్పోరేటర్ ముమ్మన దేముడు పరిశీలించారు. డ్రైనేజీ పనులు కోసం పలు చోట్ల తవ్వేయడంతో, ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి. ఆ ప్రాంతాలలో వైసిపి నాయకులు, అధికారులతో కలిసి పర్యటించిన కార్పోరేటర్ రోడ్లకు దగ్గరుండి మరమ్మత్తులు చేయించారు. ఈ సందర్భంగా ముమ్మన దేముడు మాట్లాడుతూ ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరిత గతిన కాంక్రీట్ వనులు పూర్తిచేయాలని, పనుల్లో నాణ్యతను పాటించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో యూజీడి అధికారులు కెవిఆర్.లక్ష్మి, సంగమేశ్వరరావు, భవాని తదితరులు పాల్గొన్నారు.

బాస్ ప్రోగ్రామ్‌ను విస్తరించిన జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటర్ ఇండియా

విశాలాంధ్ర- విశాఖపట్నం: భారతదేశంలో ప్రయాణీకుల ఈవీ విభాగాన్ని పునర్నిర్వచించటానికి తన నిరంతర ప్రయత్నంలో భాగంగా ఇటీవల ప్రారంభించిన ప్రత్యేకమైన బాస్ ప్రోగ్రామ్‌ను దాని ప్రసిద్ధ కామెట్ ఈవీ జెడ్ఎస్ ఈవీ మోడళ్లకు జెఎస్ డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా విస్తరించింది. బాస్ కాన్సెప్ట్ తొలుత ఎంజి విండ్సర్ తో పరిచయం చేయబడింది మరియు అప్పటి నుండి ప్రోత్సాహకరమైన ప్రతిస్పందనలను అందుకుంది. ఈ ప్రత్యేక మైన బాస్ ప్రోగ్రామ్ కింద, కస్టమర్‌లు ఇప్పుడు స్ట్రీట్-స్మార్ట్ కార్ ఎంజి కామెట్ ఈవీని రూ.4.99 లక్షల ప్రారంభ ధరతో ఇంటికి తీసుకురావచ్చు ప్లస్ బ్యాటరీ అద్దె రూ. 2.5/కిమీ, భారతదేశపు మొట్టమొదటి ప్యూర్ ఎలక్ట్రిక్ ఇంటర్నెట్ ఎస్ యు వి - ఎంజి జెడ్ ఎస్ ఈవీ ప్రారంభ ధర రూ. 13.99 లక్షలు ప్లస్ బ్యాటరీ అద్దె రూ. 4.5/కిమీతో లభిస్తుందనీ జెఎస్ డబ్ల్యు ఎంజి మోటార్ ప్రతినిధి సతీందర్ సింగ్ బజ్వా తెలిపారు.

సెయింట్-గోబైన్ జిప్రోక్ ఇండియా-2024కు గౌహర్ బిలాల్‌కు మద్దతు

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశంలోని యువతకు నైపుణ్యం కల్పించడం అనేది జిప్రోక్ ఇండియా యొక్క మిషన్‌లో ముందంజలో ఉందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ - జిప్రోక్ బిజినెస్, సుదీప్ కోల్టే, ఈ ఇనిషియేటివ్ పట్ల తన ఉత్సాహాన్ని వ్యక్తం చేస్తూ, " ఈ అద్భుతమైన ప్రయాణాన్ని ప్రారంభించిన గౌహర్ బిలాల్ కు మద్దతు ఇవ్వడం మాకు చాలా గర్వంగా ఉందన్నారు. మా నిబద్ధతను హైలైట్ చేయడమే కాకుండా ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా స్థానిక ప్రతిభకు ఉన్న శక్తిపై మా నమ్మకాన్ని కూడా ప్రదర్శిస్తుందన్నారు. సరైన వనరులు సహకారంతో ప్రతిభను పెంపొందించుకుంటే ఏమి సాధించవచ్చునేదానికి గౌహర్ ప్రయాణం ఒక స్ఫూర్తిదాయకమైన నిదర్శనం, అతను ప్రపంచ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నందున మేము అతని వెనుక నిలబడ టానికి సంతోషిస్తున్నామన్నారు.ప్రపంచ వేదికపై ప్రతిష్టను సాధించడానికి భారతీయ ప్రతిభకు సాధికారతనిస్తుంది. వరల్డ్ స్కిల్స్ కాంపిటీషన్ లో గౌహర్ వంటి నిపుణులు పాల్గొనడం అటువంటి అవకాశాల ద్వారా అన్ లాక్ చేయగల అద్భుతమైన సామర్థ్యానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు.

ఏఐ శక్తితో కూడిన 'బిగ్ టీవీ ఫెస్టివల్' తీసుకువచ్చిన శాంసంగ్

విశాలాంధ్ర- విశాఖపట్నం: భారతదేశపు అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, ఈ పండుగ సీజన్‌ను తమ 'బిగ్ టీవీ ఫెస్టివల్' ప్రమోషన్‌తో మరింత ఆనందదాయకంగా మార్చడానికి సిద్ధంగా ఉంది. నియో క్యుఎల్ఈడి 8కె , నియో క్యుఎల్ఈడి 4కె, ఓఎల్ఈడి, క్రిస్టల్ 4కె యుహెచ్ డి టీవీల వంటి ప్రీమియం ఏఐ -ఆధారిత పెద్ద-స్క్రీన్ టెలివిజన్‌లపై సాటిలేని డీల్‌లను అందిస్తూ, పరిమిత వ్యవధి ఆఫర్‌లను సెప్టెంబర్ 14 నుండి నవంబర్ 10, 2024 వరకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఉత్తేజకరమైన ఉచితాలు , క్యాష్‌బ్యాక్‌ను అందిస్తాయి. వీటితో పాటుగా మూడు సంవత్సరాల వారంటీ మరియు ప్రత్యేక ఈఎంఐ ఆఫర్‌లను సైతం అందిస్తుంది. సామ్‌సంగ్ బిగ్ టీవీ ఫెస్టివల్ అనేది ఏఐ అనుసంధానిత ఫీచర్‌లతో లీనమయ్యే దృశ్య వీక్షణ అనుభవాలు మరియు సౌండ్ క్వాలిటీలో కొత్త ప్రమాణాన్ని నిర్దేశించబోతోంది.

కస్తూర్బా గాంధీ విద్యార్థినీలకు ఫుడ్ ప్రాసెసింగ్‌పై అవగాహన

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో కస్తూరిబా గాంధీ హైస్కూల్ విద్యార్థినిలకు వృత్తి శిక్షణలో భాగంగా రైస్ ప్రాసెసింగ్‌పై ఇన్‌చార్జ్ నాగమణి ఆధ్వర్యంలో 9, 10వ తరగతి విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దగ్గరలో ఉన్న శ్రీ సూర్య రాములు రైస్ మిల్ వద్దకు తీసుకువెళ్లి ఫుడ్ ప్రాసెసింగ్, గ్రేడింగ్,

ఫేకింగ్ విషయాలపై ఫుడ్ ట్రేడ్ టీచర్ స్వర రాజ్యలక్ష్మి, ఝాన్సీ, వాటిపై వివరంగా విద్యార్థినిలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ మేనేజర్ జనార్దన్ రావు, సిబ్బంది పైల పెంటయ్య టీచర్స్ పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన గురజాడ జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర - యస్. రాయవరం : మహాకవి గురజాడ వెంకట అప్పారావు జన్మస్థలం ఎస్. రాయవరంలో గురజాడ జయంతి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. గురజాడ జయంతి సందర్భంగా స్థానిక గురజాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేయగా అందులో భాగంగా భరతనాట్యం ప్రదర్శించారు. ఎలమంచిలికి చెందిన సాహితీ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బాలికలు భరతనాట్యాన్ని ప్రదర్శించడంతో

ప్రేక్షకులకి ఆకట్టుకున్నాయి. మొదటి రోజు కార్యక్రమానికి వచ్చిన ముఖ్యఅతిథి విశ్రాంతి తెలుగు అధ్యాపకులు రామకృష్ణ రాజు మాట్లాడుతూ... గురజాడ రచించిన రచనలు ఆధునిక భాషకు అనుగుణంగా ఉన్నాయని అన్నారు. దేశభక్తితోపాటు తెలుగు భాష పై ఎంతో మొక్కువా ఉండేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో, స్థానిక ఎంపీటీసీలు బొలిశెట్టి గోవిందరావు, బైపా శ్రీనివాసరావు, గురజాడ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కందుల వెంకటేశ్వరావు, సభ్యులు పడమట మంగరాజు, మాజీ ఎంపిటిసి కొణతాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టేందుకు సమష్టి కృషి అవసరం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టేందుకు సమష్టి కృషి అవసరమని కేవలం ఒక్క అధికారులు మాత్రమే చర్యలు చేపడితే సరిపోదని.. తల్లిదండ్రులు, సామాజిక కార్యకర్తలు భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందని యునిసెఫ్ ప్రతినిధులు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఉన్నత స్థాయి అధికారులు అభిప్రాయపడ్డారు. దక్షిణ భారతదేశంలో మన రాష్ట్రంలోనే బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని.. ఈ పరిణామం చాలా విచారకరమని పేర్కొన్నారు. అందరిలో స్ఫూర్తి నింపడం ద్వారా.. అందరి భాగస్వామ్యంతో ఈ పరిస్థితిని మార్చాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఉవాచించారు. కిశోర వికాసం అనే అంశంపై శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రాంతీయ స్థాయి వర్క్ షాప్ జరిగింది. ఏపీ, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలకు యునిసెఫ్ ప్రతినిధిగా వ్యవహరిస్తున్న చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి మురళీ కృష్ణ, యునిసెఫ్ ప్రతినిధులు కాశీనాథ్, మేరీ జొనెస్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జి. చిన్నయిదేవి పాల్గొని వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పాలసీ విధానాలపై, భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. కౌమార దశలోకి వచ్చే బాలికలతో ప్రత్యేకంగా మాట్లాడాలని, జీవితంలో ఎదురయ్యే సమస్యలపై, వివాహ జీవితంపై పూర్తిగా అవగాహన కల్పించాలని సూచించారు. వారి

చదువుకు ఇటు తల్లిదండ్రులు, అటు అధికారులు అధికా ప్రాధాన్యత ఇవ్వాలని, వారికి బంగారు భవిష్యత్తు అందించేందు అందరూ సమష్టి కృషి చేయాలని హితవు పలికారు. 15 - 18 ఏళ్ల వయసు లోపు ఉన్న పిల్లలు మన రాష్ట్రంలో 10 శాతం వరకు ఉన్నారని, వారిలో 5 శాతం ఉన్న బాలికలు చదువుకు దూరం అవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ రీజనల్ వర్క్ షాప్ లో వివిధ జిల్లా నుంచి ఐసీడీఎస్ పీడీలు, సీడీపీవోలు, ఏసీడీపీవోలు, నోడల్ అధికారులు తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాల వల్లే స్టీల్‌ప్లాంట్‌కు నష్టాలు

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

విశాలాంధ్ర - విశాఖ కలక్టరేట్: విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే నష్టాలు వస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి హెచ్ నర్సింగరావు అన్నారు. శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ"ప్రైవేటు ఉక్కు ఫ్యాక్టరీల మాదిరిగా విశాఖ స్టీల్‌కు లాభాలు ఎందుకు రావడంలేదు" అని "ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సెప్టెంబ్ 17 న ప్రెస్‌మీట్‌లో ప్రశ్నించారు. "ఆడలేక మద్దెల ఓడు" అన్నట్లు కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శించలేక విశాఖస్టీలుపై అభాండాలు వేయడం ఆపాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ 120 శాతం ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించిన చరిత్ర ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం గత 30 ఏళ్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోయినా సొంత లాభాలతో సాలీన 32 లక్షల టన్నుల సామర్థ్యం నుంచి 73 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యానికి పెంచిందని, హుద్‌హుద్ నష్టాలు వెయ్యి కోట్లను కేంద్రం ఒక్క రూపాయి కూడా భరించలేదన్నారు. కోవిడ్ కాలంలో కూడా విశాఖ స్టీల్ లాభాల్లోనే ఉంది. రాజకీయ కారణాలతో రాయబెరిల్లీలో రైల్‌వీల్ ప్లాంట్ కోసం 2 వేల కోట్లు అనవసరంగా ఖర్చుపెట్టించారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా సాలీన విశాఖ స్టీల్ ప్లాంట్ రూ.3 వేల కోట్లకు పైగా అదనంగా ఖర్చు పెట్టవల్సి వస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం అక్టోబరు మొదటి వారంలో కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా, రైతు తదితర ప్రజా సంఘాలతో కలిపి 3 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిరాహార దీక్షలు జరుపుతామన్నారు. ఈ మీడియా సమావేశంలో ఆర్.కె.ఎస్.వి.కుమార్, బి.జగన్ పాల్గొన్నారు.

నగరంలో మరో హిమాలయ ఆప్టికల్ స్టోర్ ప్రారంభం

విశాలాంధ్ర- విశాఖపట్నం: నగరంలోని ఎన్ఏడీ సెంటర్ వద్ద హిమాలయ ఆప్టికల్ స్టోర్ ప్రారంభించారు. కళ్ళజోళ్ళ రంగంలో 85 ఏళ్ల అనుభవం కలిగిన హిమాలయ ఆప్టికల్ వారు ఆంధ్రప్రదేశ్ లో 9వ విశాఖ నగరంలో తమ 7వ స్టోర్ ను ప్రారంభించారు. ఈ స్టోర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సినీ నటి అనన్య నాగళ్ళ అతిథిగా పాల్గొన్నారు. ఈ వేడుకలో పాలుపంచుకోవటం తనకు ఎంతో సంతోషంగా ఉంది అన్నారు. ఈ సరికొత్త ఆప్టికల్ స్టోర్ అన్ని ఆధునిక సాంకేతిక హంగులను కలిగి మిమ్మల్ని ఆకర్షించు రీతిలో వివిధ శ్రేణుల కళ్ళజోళ్ళు మీకు ప్రదర్శిస్తుందన్నారు. హిమాలయ ఆప్టికల్ హెడ్ మయాంక్ బంగూర్ మాట్లాడుతూ

స్టోర్ నందలి అత్యంత అనుభవశాలురైన శిక్షణ పొందిన ఆప్టోమెట్రిస్టులు బృందం నిర్వహించు 360 డిగ్రీల కంటి పరీక్షలు ఖచ్చితత్వాన్ని నిర్ధారిస్తాయన్నారు. కంటి చూపును మరియు కంటి లోపలి అమరికలు కొలుచుటకు అవసరమైన సాంకేతిక సాధనాల వ్యవస్థ "

విసియోఫీస్ " స్టోర్ నందు అందుబాటులో ఉందని చెప్పారు. దీనిద్వారా కంటికి సంబంధించిన దృష్టి లోపాలు గుర్తించి సవరించ వచ్చును మరియు అందుకు అనువైన సౌకర్యవంతమైన కళ్ళ జోడు, కాంటాక్ట్ లెన్స్ అందించుటకు వీలవుతుందన్నారు.

మంజూరైన ప్రతి ఇంటినీ కట్టించి తీరాల్సిందే..

గృహ నిర్మాణ శాఖ ఎండీ రాజాబాబు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: పేదల సొంతిటి కలను నెరవేర్చటంలో భాగస్వామ్యం అవుతూ.. మంజూరైన ప్రతి ఇల్లునూ అధికారులు దగ్గరుండి కట్టించాలని, గుత్తేదార్లకు, లబ్ధిదారులకు సంపూర్ణ సహకారం అందించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎండీ రాజాబాబు జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె. విశ్వనాథన్, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం జీవీఎంసీ మీటింగు హాలులో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు జరిగిన నిర్మాణాల ప్రగతిని తెలుసుకున్న ఆయన మరిన్ని ఫలితాలు సాధించాలని నిర్దేశించారు. సాంకేతిక సమస్యలను అధిగమించి నిర్మాణాల్లో జోరు పెంచాలని విశాఖపట్టణం జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు. సమావేశంలో భాగంగా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 1.0 పథకంలో భాగంగా లబ్ధిపొందిన వారికి మరొక్క గృహ సంబంధిత పథకంలో అవకాశం రాదని రాజాబాబు స్పష్టం చేశారు. పీఎం ఆవాస్ యోజన 2.0 నేపథ్యంలో కొంతమంది లబ్ధిదారులు పునరాలోచనలో ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 1.0లో లబ్ధి పొందిన వారికి 2.0లో అవకాశం రాదని, మార్పులు చేర్పులు ఉండబోవని తేల్చి చెప్పారు. దీనిపై లబ్ధిదారులకు క్షేత్రస్థాయి అధికారులు క్షుణ్ణంగా విడమరిచి చెప్పాలని, ఇప్పుడు మంజూరైన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకునేలా ప్రోత్సాహం అందించాలని సూచించారు. జిల్లాలో జరిగిన ఇళ్ల నిర్మాణాల ప్రగతిని గృహ నిర్మాణ శాఖ ఎండీకి వివరించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ 100 రోజుల ప్రణాళికకు అనుగుణంగా అందరం సమన్వయంతో పని చేస్తామని, ఇళ్ల నిర్మాణాల్లో మరిన్ని మెరుగైన ఫలితాలు సాధిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ డి. అఖిల, విశాఖ, భీమిలి, పెందుర్తి ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, శేషశైలజ, ఇతర విభాగాల అధికారులు, గుత్తేదార్లు పాల్గొన్నారు.

సమగ్ర కులగణనతోనే బీసీలకు న్యాయం

విశాలాంధ్ర - విశాఖపట్నం: స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన 16 ఎన్నికల్లో ఇప్పటి ఆంధ్ర ప్రదేశ్ భూభాగంలో 2092 మంది ఎమ్మెల్యేలు ఐతే, అందులో కేవలం 498 మంది మాత్రమే బీసీల నుండి అవడం ఎక్కడ న్యాయం, అని రిటైర్డ్ డీజీపీ, బహుజన్ సమాజ్ పార్టీ ఏపీ కోఆర్డినేటర్ డా పూర్ణచంద్ర రావు ప్రభుత్వాలని నిలదీశారు. విశాఖలో గురువారం నాడు కులగణన డిమాండ్ పై జరిగిన బీఎస్పీ జిల్లా స్థాయి బీసీ రౌండ్ టేబుల్ అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభాలో 50 శాతానికి పైగా బీసీలు దాదాపు 1400 -1500 మంది అసెంబ్లీలోకి అడుగుపెట్టాల్సి ఉండగా, కేవలం 500 మంది అవడం వలన బీసీ కులాలు చారిత్రకంగా తీవ్రంగా నష్టపోయాయన్నారు. అసెంబ్లీలో ప్రాతినిధ్యం, రాజ్యాధికారం లేనప్పుడు, వీరి కులాల హక్కుల కోసం పోరాడేది ఎవరు, వీరి బాగు చూసేది ఎవరు అని ప్రశ్నించారు. ఒక మంగలి కులం ఎమ్మెల్యే ఇప్పటివరకు అసంబ్లీలో లేకపోవటం ఎంత దారుణం అని, అదే పెరియార్ రాజకీయ సిద్ధాంతాలను పాటించి పక్కరాష్ట్రం తమిళనాడులో ఏకంగా మంగలి కులం నాయకులు ముఖ్యమంత్రులు అయ్యారన్నారు. అధికారం లేకపోతే అణగారిన కులాలుగానే మిగిలిపోతారనీ, అందుకే బీఎస్పీ కులగణన అమలుకు పట్టుబట్టిందన్నారు. దీనిద్వారా కులాలకు రాజకీయ ప్రాతినిధ్యం మరింతగా పెరిగి, వారి హక్కులను వారు సాధించుకునే పరిస్థితి వస్తుందనీ, లేకపోతే 50 శాతం పైగా ఉన్న బీసీలకోసం 2 శాతం నిధులు ఖర్చు చేసే దుర్మార్గం జరుగుతూనే

ఉంటుందన్నారు. ప్రభుత్వాల్లో మంత్రి పదవుల్లో దామాషా ప్రకారం సింహభాగం బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు కేటాయించండి, అలాగే సీఎస్, నామినేటెడ్ పదవులు, సెక్రటరీ పోస్టులు, వైస్ చాన్సలర్లు, జడ్జిలు, ఆయా పోస్టుల్లో వీరికి విశిష్ట భాగం కేటయించాలన్నారు. అలా కేటాయించే దమ్ము ప్రభుత్వాలకు ఉందా అని నిలదీశారు. అందుకే కులగణన చారిత్రక అవసరం, దానితో వీరి బండారం బయటపడుతుందన్నారు. ఈ సందర్భంగా, ఆంధ్ర ప్రదేశ్ లో, గత 16 ఎన్నికల్లో వివిధ కులాల ప్రాతినిధ్యం, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు జరిగిన అన్యాయం మీద డాక్టర్ రావు రచించిన కులాంధ్ర ప్రదేశ్ అనే పుస్తకాన్ని విడుదల చేయటం జరిగింది.

పండుగ వాతావరణంలో విడుదలైన మన్యం ధీరుడు

విశాలాంధ్ర - విశాఖపట్నం: నగరానికి చెందిన ఆర్‌వీవీ సత్యనారాయణ నిర్మాత దర్శకత్వం వహించి హీరోగా నటించిన మన్యం ధీరుడు చిత్రం అభిమానుల కోలాహలం మధ్య విడుదలైంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచి వెంకటేశ్వర థియేటర్ ఆవరణలో పూర్తి పండుగ వాతావరణం నెలకొంది. బాణాసంచాతో పూర్తిగా సందడిగా మారింది. ఈ సందర్భంగా తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ మాట్లాడుతూ.. బ్రిటిష్ వారి గుండెల్లో సింహమై నిలిచిన అల్లూరి సీతారామరాజు జీవిత కథ ఆధారంగా నిర్మించిన మన్యం ధీరుడు చిత్రం ప్రతి ప్రేక్షకుడిలో దేశభక్తి కాంక్షను రగిలిస్తుందన్నారు. ముఖ్యంగా పాఠశాల, కళాశాల విద్యార్థులతో పాటు అన్ని వర్గాల వారు మన్యం ధీరుడు చిత్రాన్ని తప్పక చూడాల్సిన చారిత్రాత్మక అవసరం ఉందన్నారు. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన నరేష్ డెక్కల అలాగే ఈ సినిమాలో నటించిన నటులు అందరూ ప్రేక్షకుల మధ్యన చిత్రాన్ని వీక్షించారు. ఈ సినిమా చాలా అద్భుతంగా వచ్చిందని అక్కడ వీక్షించిన ప్రేక్షకులు అందరూ ఆర్ వి వి సత్యనారాయణ, నరేష్ డెక్కలకు అభినందనలు తెలియజేశారు.